వేదాంతభేరి

జనవరి 2021

రూ. 10/-

వేదాంతభేరి

జనవరి 2021 రూ. 10/-

30-11-2020 కార్తీక పౌర్ణమి నాడు తుఫాన్ గిరిజన కాలనీలో
అన్నదానంకు ముందు వినాయకునికి పూజ మరియు భజన

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 54 జనవరి 2021 సంచిక : 01

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 54 జనవరి 2021 సంచిక : 01

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. మమ మాయా దురత్యయా-
- శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06

03. శ్రీ రమణతత్త్వము -సద్దర్శనం - బొప్పన అరుణాదేవి - 10

04. సాధన పంచకమ్ - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు - 14

05. శ్వేతాశ్వతరోపనిషత్తు శ్రీ శంకర భగవత్పాదులవారు చేసిన
సంబంధ భాష్యం - ఆచార్య శంకరానందగిరి స్వాములవారు - 19

06. కర్మ - శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు - 26

07. భగవాన్ లీలలు - 35

08. భాగవతం షష్ఠస్కంధము-శ్రీమాతా పరావిద్యానందగిరిస్వామిని-37

09. కూర్మావతార ప్రశస్తి - ఆర్. శోభాదేవి - 40

10. వార్తలు - 42

ముఖచిత్రం -

సకల లోక ఆరోగ్య ప్రదాత సూర్యభగవానుడు

11.01.2021 మాసశివరాత్రి

13.01.2021 బుధవారం భోగి పండుగ

14.01.2021 గురువారం మకరసంక్రాన్తి

26.01.2021 రిపబ్లిక్ డే, 28.01.2021 పూర్ణిమ

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

నమస్తే ఆదిత్య । త్వమేవ ప్రత్యక్షం కర్మకర్తాఽసి ।

త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాఽసి । త్వమేవ ప్రత్యక్షం విష్ణురసి।

త్వమేవ ప్రత్యక్షం రుద్రోఽసి । త్వమేవ ప్రత్యక్షం ఋగసి ।

త్వమేవ ప్రత్యక్షం యజురసి । త్వమేవ ప్రత్యక్షం సామాసి ।

త్వమేవ ప్రత్యక్ష మథర్వాసి।త్వమేవ సర్వం ఛన్దోఽసి ఆదిత్యాద్వాయుర్జాయతే ॥

ఆదిత్యాద్భూమిర్జాయతే । ఆదిత్యాదాపో జాయన్తే ।

ఆదిత్యాజ్జ్యోతిర్జాయతే । ఆదిత్యాద్వ్యోమదిశో జాయన్తే ।

ఆదిత్యాద్ దేవా జాయన్తే । ఆదిత్యాద్ వేదాజాయన్తే । ఆదిత్యోవా ఏష ఏతన్మణ్డలం తపతి । అసావాదిత్యో బ్రహ్మ । ఆదిత్యోఽన్తఃకరణ మనోబుద్ధి - చిత్తాహంకారాః । ఆదిత్యో వై వ్యానస్సమానోదానోఽపానః ప్రాణః । ఆదిత్యో వై శ్రోత్రత్వక్ చక్షూ రసనఘ్రాణాః ॥

ఆదిత్యో వై వాక్పాణిపాదపాయూపస్థాః । ఆదిత్యో వై శబ్ద స్పర్శరూప రసగన్ధాః । ఆదిత్యో వై వచనాదానాగమన విసర్గానన్దాః । ఆనన్దమయో విజ్ఞానమయో విజ్ఞానఘన ఆదిత్యః । నమో మిత్రాయ భానవే మృత్యోర్మా పాహి । భ్రాజిష్ణవే విశ్వహేతవే నమః । సూర్యాద్భవన్తి భూతాని సూర్యేణ పాలితాని తు । సూర్యే లయం ప్రాప్నువన్తి యః సూర్యః సోఽహమేవ చ। చక్షుర్నో దేవః సవితా చక్షుర్న ఉత పర్వతః । చక్షు - ర్ధాతా దధాతు నః।

ఆదిత్యాయ విద్మహే, సహస్ర కిరణాయ ధీమహీ తన్నః సూర్యః ప్రచోదయాత్ ।

మమ మాయా దురత్యయా

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

దైవసంబంధమైనదియు (అలౌకిక సామర్థ్యము కలదియు), త్రిగుణాత్మకమైనదియునగు ఈ నాయొక్క మాయ (ప్రకృతి) దాటుటకు కష్టసాధ్యమైనది. కానీ ఎవరు నన్నే శరణుబొందుచున్నారో వారీ మాయను దాటివేయగలరు. అని భగవద్గీతలో 7వ అధ్యాయంలో భగవంతుడు చెప్పుచున్నారు.

దేవుని దర్శించుటకు ఒక పెద్ద అడ్డుగోడయున్నది. అది అడ్డముగా నున్నందున ఎవరును ఆ పరమాత్మను దర్శింపజాలకున్నారు. దానినే 'మాయ' అందురు. 'పెన్న దాటితే పెరుమాళ్లు సేవ' అనునట్లు ఆ మాయను దాటిననే పరమాత్మ దర్శనమగును. అయితే దానిని దాటుట ఎట్లు? మమ మాయా దురత్యయా-ఆ పద్ధతి ఈశ్లోకమున చక్కగ చెప్పబడినది. మాయను అభివర్ణించుచు భగవానుడు నాలుగు విశేషణములను పేర్కొనియున్నారు. అవియేవి యనిన - అది (1) దైవసంబంధమైనది అనగా అలౌకికమైనది. గొప్ప సామర్థ్యము కలది (2). త్రిగుణాత్మకమైనది (3). భగవంతునకు లోబడినది (4). దాటుటకు కష్టసాధ్యమైనది. ఈ మాయా లక్షణములను గుఱించి ఒకింత విచారించెదము.

(1). మాయను 'దైవీ' (దైవసంబంధమైనది) అని వర్ణించుటచే అది సామాన్యమైనది కాదనియు, భగవత్సంబంధమైనదనియు, మహత్తర శక్తి సామర్థ్యములు గలిగి అలౌకికమైనదనియు స్పష్టమగుచున్నది. దీనినే 'వైష్ణవీమాయ' అని కూడ అందురు. అది మహాశక్తివంతమై యుండుట

వలన అనేకులను మేధాసంపన్నులను, బలవంతులను, రాజాధిరాజులను, ఇంద్రులను చంద్రులను గూడ పడగొట్టి అజ్ఞానమందు, జననమరణ ప్రవాహమందు పడద్రోయుచున్నది. జనులయొక్క లౌకికములైన తెలితేటలు దాని దగ్గఱ ఉపయోగించవు. అది దైవసంబంధమైనది కనుక దైవిక ఉపాయముల వలననే లోబడగలదు.

(2). 'గుణమయీ' అని చెప్పుటచే ఈ మాయ త్రిగుణాత్మకమైనదని, అనగా సత్త్వరజస్తమోగుణములే స్వరూపముగ గలదని తెలియుచున్నది. మాయకు (ప్రకృతికి) వేఱు ఆకారము లేదు. త్రిగుణములే దాని ఆకారము. కనుకనే 'గుణమయ' మని చెప్పబడినది. ఆ త్రిగుణములలో ఒక్కొక్క గుణమును లాగిపారవైచినచో ఇక మాయ మిగులదు. ఈ గుణములచే మోహితులయియే (భ్రమింపబడి) జనులు తన్నెఱుగజాలకున్నారని క్రిందటి శ్లోకముననే భగవానుడు తెలిపియుండుట గమనింపదగినది.

(3). 'మమ' (నాయొక్క) 'మాయా' అని చెప్పుటవలన ఈ మాయ భగవంతునకు స్వాధీనమై యున్నదని స్పష్టమగుచున్నది. ఇండ్లలోని పెంపుడు మృగములు యజమానికి లోబడియుండునట్లు మాయ పరమేశ్వరునికి లోబడి యున్నది. ('మాయినంతు మహేశ్వరమ్'). ఈ మాయ సామాన్య జనులను ముప్పతిప్పలు పెట్టునదియైనను దేవుని దగ్గర అణగియుండును (యజమానిచెంత భృత్యునిపగిది). మాయకు లోబడినవారికి దానిని జూచిన భయము. మాయను స్వాధీనపఱచుకొనిన పరమాత్మకుగాని, దానిని జయించిన జ్ఞానులకుగాని అది అల్పముగతోచును. 'యా మా సా మాయా' (ఏది లేదో అదియే మాయ) అనునట్లు దాని రహస్యమెఱిగినవారికి అది లేనిదేయగును. మహాసముద్రము భయంకరముగ తోచినను గరుత్మంతునకు గోష్పదజలమువలె తోచును. అవలీలగా దానిని దాటివేయును. ఒక దోమకు

గోష్పదజలము మహాసాగరముగ తోచును. ఆప్రకారమే మహాశక్తివంతమగు ఈ మాయ, ఈ ప్రకృతి జనులకు అనుల్లంఘనీయముగా స్ఫురించినను పరమాత్మకు స్వాధీనపడి ఆతని కొక ఉపకరణముగ వర్తించుచున్నది. కనుకనే 'మమ మాయా' - నాయొక్క మాయ, నాకు లోబడిన మాయ అని భగవానుడు చెప్పుటకు కారణమైనది.

(4). 'దురత్యయా' (దాటుటకు కష్టసాధ్యమైనది). మాయను దాటుట కష్టసాధ్యమేకాని అసాధ్యము కాదు. మనస్సును జయింపనివారు, ఇంద్రియములకు దాసులు, విషయవాంఛాపరులు అగు మనుజులు మాయను దాటలేరు. ఆత్మజ్ఞానపరాయణులు,దైవతత్పరులు, భక్తి వైరాగ్యాది సాధనోపేతులు దాటగలరు. ఈ విషయమును రెండవ పాదము నందు భగవానులు చెప్పబోవుచున్నారు.

ఈ ప్రకారముగ మాయయొక్క భయంకర స్వరూపమును తెలిసికొంటిమి. అంతమాత్రముచేత ఎవరును భీతిల్లవలసినపనిలేదు. సముద్రము విశాలమైనను, దుస్తరమైనను ఒకచిన్న ఓడను సంపాదించినచో దానిని అవలీలగ దాటివేయవచ్చును. అట్లే భయంకర మాయాసముద్రమును దాటుటకు భగవానుడు ఈ శ్లోకము యొక్క రెండవ పాదమందు చక్కని పడవను ప్రసాదించినారు. అదియే భక్తి. భగవదాశ్రయము, భగవచ్ఛరణాగతి, ఆత్మచింతన. 'నన్ను శరుణుబొందు వారీ భయంకరమగు మాయను సులభముగ దాటివేయగలర'ని పరమాత్మ కరుణతో బోధించిరి. విశ్వేశుని పాదాంబుజములను దీర్ఘనౌకచే అపార సంసార సముద్రమును దాటివేయవచ్చునని శ్రీశంకరాచార్యులున్ను తెలిపియున్నారు. అది లేనిచో దానిని దాటుట అసాధ్యమే యగును. ఏ ఇతర ఉపాయమున్ను అట పనికిరాదు. భగవచ్ఛరణాగతియే ఏకైక మార్గము.

మాయను జయించవలెననిన, లేక దాటవలెననిన, దానిని స్వాధీనపఱచుకొనినవారి పాదముల నాశ్రయించవలెను. దానిని వశమొనర్చుకొనినవాడు సాక్షాత్ పరమాత్మయే. కాబట్టి వారినే శరణు బొందవలెను. కొన్ని భవనముల ముందు కావలి కుక్కయుండును. అది యెవరిని లోనికి రానీయదు. కాని యజమానిని మంచి చేసికొనినచో అది లొంగి పోవును. అట్లే ఆ మాయయు భగవంతుని ఆశ్రయించిన వారికి దారి యొసంగును. జీవన్ముక్తులగు మహనీయులున్ను భగవదాశ్రయముచే మాయను దాటియుందురు గనుక అట్టి వారి సేవ కూడ ముముక్షువుల కెంతయో ఉపకరించును.

'తరన్తి తే' (నన్నాశ్రయించినవారు మాయను తప్పక దాటగలరు) - అని భగవానుడు విస్పష్టముగ తెలియజేయుటవలన ఇక ఈ విషయమై సంకోచము పనికిరాదు. ప్రాపంచిక వస్తువులను, ప్రాపంచిక మనుజులను శరణు బొందుట వలన పరమార్థ లక్ష్య మేనాటికిని చేకూరదు. దైవమును, దైవభక్తులనే ఆశ్రయించవలెను. 'మామేవ' (నన్నే) అని 'ఏవ' పదమును ప్రయోగించుటచే ఇతరమును దేనిని ఆశ్రయింపక ఒక్క పరమాత్మనే ఆశ్రయింపవలెనని సూచితమగుచున్నది. కావున ఎవరి తరణము వారి చేతులలోనే యున్నది. దైవము నాశ్రయించినచో తరింతురు. విషయముల నాశ్రయించినచో పతనమొందుదురు. కాబట్టి నశ్వరప్రాపంచిక వస్తువులపై నుండి దృష్టిని మరల్చి జనులు భగవచ్ఛరణాగతిపైననే దృష్టిని సంలగ్నమొనర్చవలెను. అట్టి వారి జన్మమే సార్థకము కాగలదు.

(భగవంతుని శరణుబొందుటయనగా వారిపై అనన్య భక్తి గలిగియుండుట, భగవత్కార్యములను జేయుట, ఆత్మచింతన, ఆత్మధ్యానము గావించుట, దైవిక గుణములు గలిగియుండుట మొదలైనవి యగును.)

శ్రీ రమణ తత్త్వము - సద్దర్శనం

- బొప్పన అరుణాదేవి

అందమయిన జగత్తు మానవునికి ఆనందాన్ని, ప్రశాంతతని ఇవ్వకుండా సుఖాన్ని, సంతోషాన్ని పంచకుండా అశాంతిని, అలజడిని, దుఃఖాన్ని ఎందుకు కలిగిస్తున్నది? మానవుడు ఎంతో విద్యావంతుడైనా, శాస్త్రపరంగా, సాంకేతికపరంగా ఎంతో పురోభివృద్ధిని సాధించినా, గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొన్నా, అన్నీ తనకు అందుబాటులోకి వచ్చేశాయి అని ఆనందపడినా... అవన్నీ క్షణికసుఖాలే. ఎండమావులు లాగా భ్రాంతి కలిగించేవే. పగలు గడవగానే చీకట్లు ముసురుకొన్నట్లుగా అంతులేని దుఃఖము, ఆవేదన, అశాంతి చుట్టుముడతాయి. ఈ ప్రపంచంలో ఏ ఒక్కరూ పూర్తి ఆనందాన్ని, ఐశ్వర్యాన్ని, ఆరోగ్యాన్ని తమ సొంతం చేసుకోలేరు. ఈ రోజు అవన్నీ తమ సొంతం అనుకొన్నవారే ఒక నాటికి అవి పోగొట్టుకొని వేదన చెందుతారు. ఎందుచేతనంటే అవన్నీ అనిత్యాలు కనుక. ఏది నిత్యమో, ఏవి సత్యమో దానిని తెలుసుకుంటేనే ఆనందం మానవుడికి లభ్యమవుతుంది. అలా పొందవలసినదే ఆత్మలాభం.

మానవుడు ఎప్పుడూ తన్ను తాను తెలుసుకోవాలి అని ప్రయత్నించడు. దానిని వదిలి మిగిలినవన్నీ తెలుసుకోవటానికి, పొందటానికి ఆరాటపడుతాడు. జీవితం చరమదశకు వచ్చిన తరువాత ఏమీ తెలుసుకోకుండానే వెళ్ళిపోవడానికి తయారవుతాడు. దేహం మన వశంలో ఉండగానే మనం వచ్చిన పని పూర్తి చేసుకోవాలి. 'నేను ఆత్మను' అను సత్యాన్ని తెలుసుకోగలిగితే జీవితాన్ని, ప్రపంచాన్ని, దైవాన్ని మనం

సరిగ్గా అవగాహన చేసుకొంటాము. ఏదీ మనలను అంటుకోదు. కష్టాలు బాధపెట్టవు. సుఖాల వల్ల, గౌరవ మర్యాదల వలన వచ్చిపడేది ఏమీ లేదని తెలుస్తుంది.

ఏది నీ ఆనందాన్ని అడ్డుకుంటున్నదో, ఏది నీ దుఃఖానికి మూల కారణం అవుతున్నదో అది నీ మనస్సు తప్ప మరేమీ కాదు. అంతా మనకు తెలుసునని, అంతా మన తెలివితేటల వల్లనే అనుకూలిస్తున్నాయని, మనమే అందరికన్నా మిన్నయనీ మనస్సు అహంకరించి ఉంటుంది. అటువంటి ఆలోచనలను నియంత్రించాలని, వినయం నేర్చుకోవాలని, శరణాగతి అలవర్చుకోవాలని, సమబుద్ధి ఏర్పర్చుకోవాలని, చెక్కుచెదరని మనో నిబ్బరం అప్పుడే అలవడుతుందని, అన్నింటినీ అధిగమించే అతీతస్థితి ఏర్పడుతుందని, అదే పరిపూర్ణత్వమని, అదే జ్ఞానమని, ఆత్మస్థితి అని, ఆనందసిద్ధియని మౌనముని మన రమణుని సద్దర్శనం.

అఖండమైనటువంటి ఆత్మ అగోచరంగా ఉన్నది. కనబడకుండా ఉన్నది. దానికోసం సాధన చేస్తున్నావు. అది నీవే అయి ఉండగా దాని కోసం ప్రయత్నం ఎందులకు? మరొక దైవాన్ని ప్రతిష్ఠించవలసిన పనేముంది అంటున్నారు భగవాన్ రమణులు. ఉత్కృష్టమైనటువంటి సందేశము.

అట్టి ఆత్మను అందుకోవటానికి, లోలోపలికి వెళ్ళడానికి, ఆత్మగా తానుండటానికి ఏయే అడ్డంకులు, ఆటంకాలు, సమస్యలు, సందేహాలు, సాధకులు ఎదుర్కొంటున్నారో వాటన్నింటికి పరిష్కారం చేస్తూ, ఏది సత్యమో, ఏది నిత్యమో, ఏది సహజమో, ఏది సరళమో, ఏది సూటి అయినదో, ఏది మార్పు లేనిదో, ఏది జననం లేనిదో, ఏది మరణం

లేనిదో ఆ ఆత్మ సాక్షాత్కారము పొందటానికి మానవ జన్మ పరిపూర్ణ జన్మ కావటానికి,అటువంటి ఉన్నతోన్నత స్థితి పొందటానికి 'ఉన్నది నలుబది'లో ఆత్మ విద్యకు పరాకాష్ఠను అందించారు భగవాన్ రమణులు.

'నిన్ను నీవు తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నట్లే' అన్నారు మహర్షి పదహారవ ఏట తనకు అనుభవంలోకి వచ్చింది మరణం. దాని ఆధారంగానే ఆత్మ దర్శనమయింది. అప్పటి ఆ అనుభవం మహా నిర్వాణం వరకూ కూడా చెక్కు చెదరలేదు. దేహంలో తాను ఉండినా, ఆ దేహమే తాను కాదు అని గుర్తించి జీవన్ముక్తి పొందారు. హృదయంలో ఉన్నటువంటి ఆ ఆత్మ 'నేను'గా వెలుగుతూ ఉన్నది అని గుర్తించి, 'హృదయ కుహరమధ్యే కేవలం బ్రహ్మమాత్రం' అన్నారు.

శరీరంలో ఉన్నప్పటికి, ప్రాపంచికమయిన కర్మలతో కూడిన ఆ 'నేను' అసలు నేను కాదు అని తెలుసుకోవాలన్నారు. శాస్త్రపరమయిన జ్ఞానం ప్రామాణికం కాదని, ఆత్మానుభవమే ప్రామాణికము అన్నారు.

'ఏది సత్యమో దానిని ప్రశ్నించటానికి వీలు లేదు. ప్రశ్నించటానికి వీలు లేకుండా ఏదై ఉన్నదో అదే సత్యం. రమణాశ్రమంలో భగవాన్ దగ్గర నేను నేర్చుకున్నది. అదే' అన్నారు పాల్ బ్రింటిన్.

ఆత్మ విద్యా రహస్యాన్ని తెలుసుకోవటం కోసం, ముందుగా దాన్ని దర్శనం చేయటం కోసం 'ఉన్నది నలుబది'లో భగవాన్ అందరిలా దైవ ప్రార్థన గాకుండా హృదయానికి ప్రార్థన చేయించారు. శరీరం అనిత్యమనీ, అసత్యమనీ ఎఱుక కలిగిననాడు మరణం గురించిన భయం తొలగిపోతుంది. భగవాన్ పొందిన అమృతత్త్వమది. మహర్షి అందుచేత రెండవ మంగళ శ్లోకంలో మృత్యువుని ప్రార్థన చేయించారు. అంతర్గత

ప్రయాణానికి,ఆధ్యాత్మిక జీవితానికి ప్రపంచం అడ్డుకాదు అని మొదటి 16 శ్లోకాలలో చెప్పారు. చివరగా మనము ఈ జన్మలోనే స్వస్వరూప జ్ఞానాన్నీ, సత్యదర్శనాన్నీ, సద్దర్శనాన్ని పొందాలని నలుబయి పద్యాలలో సత్తు దర్శనం చేయిస్తారు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా రెంటికి అతీతమయిన స్థితిలో నిశ్చలంగా, నిబ్బరంగా ఉండేటటువంటి స్థితి పొందటానికి భగవాన్ మనలను అనుగ్రహించారు. 'ఉన్నది నలుబది' అర్థమయితే ఎదుర్కోనూ వద్దు, స్వీకరించనూవద్దు. సాక్షీభూతుడి వలె అక్కడ నిశ్చలంగా అట్టి స్థితిలో మనం ఉంటాము కేవలం రమణుల మాదిరిగా.

ఏది పోయిందో, అది పోవటానికే వచ్చింది. ఏది వచ్చిందో అదీ పోవటానికే వచ్చింది. మానవుడి జీవితం కాని, శరీరం కాని, ఇవన్నీ కూడా ఉండిపోవటానికి రాలేదు. ఒక్కనాటికి పోవటానికే వచ్చాయి. మరణభావన కాదిది యథార్థం. సత్యశోధనం, దేహం జడం, జడంతో అనుసంధానమై మనం కూడా జడంగా ఉండకుండా, జడాన్ని ప్రక్కకి నెట్టి, సచ్చిదానందస్థితిలోనికి వెళ్ళాలని, పూర్ణమయినటువంటి అమృత యోగాన్ని భగవాన్ మనకు అనుగ్రహిస్తున్నారు. ఆత్మానుభవం ఒకసారి వచ్చి నిలకడగా ఉంటే అది పోయేది కాదన్నారు మహర్షి. జీవుడు, దేవుడు, గురువు, ఆత్మ పరమాత్మ అన్నీ కూడా నీ కంటే భిన్నంగా లేవు అని నీ అనుభవంలోనికి వస్తుంది. అదే ఆత్మానుభవం అన్నారు మహర్షి.

సంక్రాన్తి శుభాకాంక్షలు

వేదాన్తభేరి పాఠకులకు, చందాదారులకు, పోషకులకు రచయితలకు మా హృదయ పూర్వక సంక్రాన్తి శుభాకాంక్షలు. సర్వలోక తమోహారి, ప్రకాశదాత సర్వప్రాణులకు ఆరోగ్యదాతయగు సూర్య భగవానుడు అందరికి ఆరోగ్యాన్ని,ఆనందాన్ని ప్రసాదించుగాక ! **- వేదాన్తభేరి ప్రకాశకులు.**

సాధన పంచకమ్

– శ్రీ సంపూర్ణనందగిరిస్వాములవారు

(గత సంచిక తరువాయి)

బ్రహ్మైవాస్మి విభావ్యతామ్

నేను బ్రహ్మమునే అయి వున్నాను అని బాగుగా భావింపబడవలెను. ఇది అనుభవమహావాక్యము. గురుముఖముగా తత్వమసి మహావాక్యమును బాగుగా శ్రవణము చేసిన తరువాత శిష్యుడు నేను బ్రహ్మమును,ఆ బ్రహ్మమే నేను అని భావించి ఈక్రింది విధముగా ప్రతి దినము మననము చేయవలెను.

అంతట వ్యాపించిన శక్తినే చైతన్యమని,ఆత్మయని అందురు. అంతట అనగా బ్రహ్మ, విష్ణు, ఈశ్వరుడు మొదలుకొని 33 కోట్ల దేవతలలో వున్న చైతన్యమును, మరియు మానవులందరు,అన్ని దేశములలో యున్న వారందరు, ఎన్ని కోట్లమంది గలరో వారందరిలో యున్న చైతన్యం మరల చీమ మొదలుకొని క్రిమి, కీటక, గుర్రము, ఏనుగు, సింహము మొదలగు సమస్త పశువులలో, జంతువులలో ఉన్న చైతన్యము ఒక్కటే. దీనినే ఆత్మ యందురు. ఈ విధముగానే కొండలలో, హిమాలయ పర్వతములలో, చెట్లు, పుట్టలలో, వ్యాపించిన చైతన్యమును ఆత్మయందురు. చరాచర ప్రపంచమంతా వ్యాపించిన చైతన్యమును ఆత్మయందురు. ఈ ఆత్మనే బ్రహ్మమని, పరబ్రహ్మమని, పరమాత్మయని, దైవమని,జీవాత్మయని, శుద్ధ చైతన్యమని చెప్పెదరు.

చరాచరమంతా వ్యాపించిన ఆత్మయే నాలో యున్నది అని భావించ వలెను. కావున ఆ పరబ్రహ్మమును నేనై యున్నాను. ఈ వాక్యమునే అహంబ్రహ్మాస్మి అందురు. ఈ శరీరముతో కూడిన అంతఃకరణమందు ప్రతిఫలించిన చైతన్యమును జీవుడందురు. ఈ జీవుడు పరబ్రహ్మమే నాకంటె

వేరు కాదు అని భావించవలెను. ఈ వాక్యమునే "అయమాత్మా బ్రహ్మ"యని అందురు. అనగా ఈ జీవుడు పరబ్రహ్మమే, పరబ్రహ్మకంటే వేరు కాదు అనిభావించి నేను పరబ్రహ్మమును అని భావించి, సదా అనుకొనవలెను.

నేను నిత్యుడను, ఎల్లవేళల ఉండువాడను. నేను శుద్ధుడను, మల, విక్షేప, ఆవరణములనే దోషములు లేనివాడను. నేను బుద్ధుడను, జ్ఞాన స్వరూపుడను, నేను ముక్తుడను – ఏ బంధము లేనివాడను. నేను ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వీ ఈ పంచభూతములను కాను. పంచ భూతములతో ఉత్పన్నమైన ఈ శరీరం నేను కాను. చెవి, ముక్కు కండ్లు, నాలుక, చర్మములనబడు పంచ జ్ఞానేంద్రియములు నేను కాను. నోరు, చేతులు, పాదములు, మూత్రేంద్రియం, గుదేంద్రియం, కర్మేంద్రియములు నేను కాను. జ్ఞానేంద్రియ విషయములగు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు నేను కాను. వచన, ఆదాన, గమన, విసర్జన, విషయానంద విషయములు నేను కాను. సంకల్ప, వికల్పాత్మకమగు మనస్సు నేను కాను. చింతించే చిత్తము నేను కాను. నిశ్చయించే బుద్ధి నేను కాను. నేను, నేను అనే అహంవృత్తిని నేను కాను. నేను, కర్త, భోక్త, దాతలను కాను. సత్వరజతమో గుణములను నేను కాను. నిత్య కర్మలు, నైమిత్తిక కర్మలు నేను కాను. కర్మల ఫలములు నేను కాను నావి కావు. ధర్మాధర్మములు, పుణాపుణ్యములు నేను కాను నావికావు. సర్వాంతర్యామియగు పరబ్రహ్మమునే నేను. సచ్చిదానంద స్వరూపమును నేనే. నేను సమస్త జీవులలో, సమస్త దేహములలో నున్నాను. సమస్త జీవులు నాయందున్నవి. సమస్త దేవతలలోను నేనున్నాను. నాలో సమస్త దేవతలున్నారు. తామరాకును నీళ్లంటని విధముగ, పేడ పురుగు పేడను అంటని విధముగ ప్రతి వాని హృదయంలో నేనుండి, వారి కర్మ ఫలములకు, పాప పుణ్యములకు అంటని వాడను. సాక్షాత్

సర్వాంతర్యామిని నేను. చిదాభాసుడైన జీవుడను నేనే. అహం బ్రహ్మాస్మి బ్రహ్మైవాహమస్మి. ఆ పరబ్రహ్మమే నేను అని భావించమని శ్రీ ఆచార్యుల వారు ఇరువది ఒకటవ సాధనలో తెలిపిరి. ఈ విధముగా భావించిన ఎడల మరల జన్మ రాదు. దీనినే మోక్షమందురు.

అహరహర్గర్వః పరిత్యజ్యతామ్

ప్రతిదినము, ప్రతి పనిలోను నేను నేను అనే అహంకారమును విడువ బడవలెను.

ఈ అహంకారమే సర్వానర్థములకు కారణము. అహంకారమున్న ఎడల రాగద్వేషములుత్పన్నమగును. రాగమనగా-'ఉత్కటేచ్ఛా' అథవా విషయానుబుభూషావా పునః పునః వియానురంజనేచ్ఛా ఇతి. ఈవిధముగా రాగలక్షణములు కలవు. భావమేమనగా -ఒక విషయమును అనగా శబ్దం, స్పర్శ, రూప, రస గంధాదులనే విషయములలో ఏదో ఒక విషయము ననుభవించి దాని వలన కలిగిన సుఖమునందు మాటిమాటికి ఆ సుఖమును పొందాలని భోగ సాధన విషయమునందున్న అత్యంతాసక్తిని రాగ మందురు. యయాతి చక్రవర్తికి వృద్ధాప్యము వచ్చినా విషయ భోగములయందు ఉత్కటేచ్ఛ వదలలేదు. దీనినే రాగమందురు. పతంజలి మహర్షి "సుఖానుశయీరాగః" సాధన పాదములో చెప్పిరి. ద్వేషమనగా - వృథానిందా, పర అనిష్టాభిలాషః. పతంజలిమహర్షి గూడ-"దుఃఖానుశయీద్వేషః" అన్నారు.

ఇతరుల యందు నిందలు చెప్పడం ద్వేషమందురు. పరులకు నష్టము కలిగించాలనే మనస్సును ద్వేషమందురు. దుఃఖానుభవానంతరము, ఆ దుఃఖము ఏ ప్రాణి వలన, ఏ వస్తువు వలన గలిగినదో వాటియందు గలుగు క్రోధమునే ద్వేషమందురు. అనగా దుఃఖ సాధనములందు క్రోధము గలుగును. దుఃఖముననుసరించి ద్వేషము కల్గును. అహంకారము వలన

రాగద్వేషములు గలుగునని భావము.

రాగద్వేషముల వలన కర్మ గలుగును. రాగము వలన రాగ కర్మ గలుగును. రాగము వలన తనకనుకూలమైన వస్తువును పొందాలనే ఉద్దేశ్యముతో సదా ప్రయత్నము చేయును. ఈ ప్రయత్న విశేషమునే కర్మయందురు. 'క్రియతే ఇతి కర్మ' చేయబడునది కర్మయనబడును. ఏ వస్తువుతో తనకు అనుకూలమైన సుఖం కలుగుచున్నదో, ఆ వస్తువు సదా తన చెంతనే యుండాలని దానికి తగు కర్మ చేయును.

ద్వేషము వలన కర్మ గలుగును. ఎవరు తనకు దుఃఖాన్ని గలిగించారో, అతనికి ప్రతిక్రియగా కష్టము గలిగించాలని, అతనికి అపకీర్తి గలిగించాలని, అవమానించాలనే భావంతో చేయు పనినే కర్మయందురు.

రాగద్వేషముల వలన కర్మ, కర్మ వలన జన్మ గలుగును. జన్మకు కారణం కర్మే. వేద విహితములైన సత్య ధర్మములతో, నిత్య అనుష్ఠానముతో, దైవ స్మరణతో, దైవార్పిత బుద్ధితో, పరోపకార పరాయణతతో కర్తవ్యకర్మలను చేయువానికి వీటి పుణ్యఫలం ద్వారా వచ్చేజన్మలో కీర్తి ప్రతిష్ఠలతో వర్ధిల్లి సుఖ జీవనము గలిగిన మానవ జన్మను బొందుదురు. వేద నిషిద్ధములైన అసత్య,అధర్మ,హింసాప్రవృత్తములతో ఇతరులకు అపకారమును చేయు చుండిన కర్మలు చేయువాడు మానవుడై పుట్టిన నానావిధ రోగములతో దుఃఖ భూయిష్టమైన స్థితిని అనుభవించును. నీచాతినీచమైన ఘోర పాపకర్మలు చేయువారలు పశుపక్ష్యాది జన్మలను బొందుదురు. అత్యుత్తమమైన యజ్ఞ యాగాది కర్మలు,నిత్యానుష్ఠాన కర్మలు,దానాది కర్మలు చేయు వారలు స్వర్గాది లోకములో దేవతా జన్మను పొందుదురు. కావున జన్మకు కారణం కర్మయే.

అహంకారమువలన రాగద్వేషములు గలుగును. వీటి వలన కర్మ కర్మ వలన జన్మ గలుగును. పుట్టిన వానికి మరణం. మృతి చెందిన వానికి

జన్మ. కర్మ జన్మ. జన్మకర్మ ఇది ఒక ప్రవాహంగా ఉండును. అహంకార పూర్వకమైన గర్వమును విడువవలెనని శ్రీ ఆచార్యులవారు ఈ ఇరువది రెండవ సాధనలో దెలిపిరి.

దేహేఽహం మతిరుజ్ఝ్యతామ్ ।

దేహము నందు నేను అను బుద్ధిని విడువబడవలెను. అహంకారము యొక్క నిజస్వరూపమును వివరిస్తూన్నారు. దేహమే నేనని,దేహము నందు ఆత్మ బుద్ధి నుంచుటయే అహంకారము. ప్రపంచములో నుత్పత్తియగు సమస్త వస్తువులు' వాహనములు, విమానములు, మొదలగు టెక్నాలజీలన్నీ దేహము నాశ్రయించుకొనేయున్నవి. దేహ సుఖము కొరకే ఈ సమస్త వస్తు సముదాయము. దేహము నేను అనుకొన్నపుడు వస్తువుల యందు వ్యామోహమైన అహంకారముతో నేను, నాది యనే బుద్ధి గలుగును. దేహము నేను కాదు అని దృఢపడిన ఈ వస్తువులు నావి కావు, నేను కాను అనే బుద్ధి యుదయించి అహంకారము పోవును. శ్రీశంకరాచార్యుల వారు రచించిన నిర్వాణ షట్కమును ప్రతి దినము ఒక పర్యాయము భావముతో చదువవలెను. ఏ పని చేస్తున్నా గాని లేక విరామ సమయంలో గాని ఆ భావమును గుర్తు చేసుకొనిన ఎడల దేహాత్మ బుద్ధిపోయి చిదానంద రూపశ్శివోఽహమ్ శివోహమ్ అని జ్ఞానము గలిగి దేహం నేననేభావం పోవును. అపుడే బ్రహ్మము నేననే బుద్ధి యుదయించి సుఖము పొందును అని శ్రీ ఆచార్యుల వారు ఇరువది మూడవ సాధనను తెలిపిరి.

చందాదారులకు విజ్ఞప్తి

2020 డిశంబరు నెలతో సంవత్సర చందాదారుల చందా పూర్తయినది. కాబట్టి సంవత్సర చందాదారులు వెంటనే తమ చందా నూరు రూపాయలు పంపగోరుచున్నాము.

శ్వేతాశ్వతరోపనిషత్తు శ్రీ శంకర భగవత్పాదులవారు చేసిన సంబంధ భాష్యం

- ఆచార్య శంకరానందగిరి స్వాములవారు,

(పరమాత్మానందాశ్రమము)

ప్రియాత్మ బంధువులారా !

శ్రీమచ్ఛంకరభగవత్పాదులవారు ఎన్నో ఉపనిషత్తులకు సంబంధ భాష్యం వ్రాశారు. బ్రహ్మసూత్రాలకూ వ్రాశారు. కాని శ్వేతాశ్వతర ఉపనిషత్తునకు వ్రాసినంత సంబంధ భాష్యం ఏ ఉపనిషత్తునకు కనుపించదు. దీని సంబంధభాష్యంలో శ్రుతి, స్మృతి, ఇతిహాస, పురాణ, బ్రహ్మసూత్రాది అనేక గ్రంథాల నుండి అధ్యాసకు, జీవబ్రహ్మైకత్వానికి, మాయ మరియు దాని కార్యకలాపాలకు సంబంధించిన ఎన్నో విషయాలను సంగ్రహం చేసి, అద్వైత సిద్ధిని అధ్యాసను ఆత్మైకత్వాన్ని బోధించారు. ఉత్తమ సాధకునికి దీనికి మించిన బోధ అవసరం ఉండబోదేమో. ముముక్షువులు, భక్తులు, జిజ్ఞాసువులకు ఈ విషయం చాలా అవసరమని తోచినందున భాష్యానికి తెలుగు అనువాదం చేసి మీముందుంచుచున్నాను. అవసరమున్నవారు వినియోగించుకుని నా ఈ పరిశ్రమను సార్థకం చేస్తారని ఆశిస్తున్నాను. అస్తు.

శం.భా. శ్వేతాశ్వతరోపనిషదిదం వివరణ మల్పగ్రన్థం బ్రహ్మజిజ్ఞాసూనాం సుఖావబోధాయారభ్యతే. చిత్సదానన్దా ఽ ద్వితీయ బ్రహ్మస్వరూపో ఽ ప్యాత్మా స్వాశ్రయయా స్వ విషయయా ఽ విద్యయా స్వానుభవగమ్యయా సా ఽ ఽ భాసయా ప్రతిబద్ధస్వాభావికాశేషపురుషార్థః ప్రాప్తాశేషానర్థో ఽ విద్యాపరికల్పితైరేవ సాధనైరిష్టప్రాప్తిం చా ఽ పురుషార్థం పురుషార్థం మన్యమానో మోక్షార్థమలభమానో మకరాదిభిరివ రాగాదిభిరితస్తతః సమాకృష్యమాణః సురనరతిర్యగాది ప్రభేదభేదిత నానాయోనిషు సంచరన్ కేనాపి సుకృతకర్మణా బ్రాహ్మణాద్యధికారి శరీరం ప్రాప్త ఈశ్వరార్థ

కర్మానుష్ఠానేనా ఽ పగతరాగాదిమలో ఽ నిత్యాదిదర్శనేనోత్పన్న ఇహాముత్రార్థ భోగవిరాగ ఉపేత్యాచార్యద్వారేణ వేదాంతశ్రవణాదినా ఽ హం బ్రహ్మా ఽ స్మీతి బ్రహ్మాత్మతత్త్వ మవగమ్య నివృత్తా ఽ జ్ఞానతత్కార్యో వీతశోకో భవతి. అవిద్యానివృత్తిలక్షణస్య మోక్షస్య విద్యాధీనత్వాద్ యుజ్యతే చ తదర్థోప నిషదారమ్భః.

అనువాదం -బ్రహ్మతత్త్వ జిజ్ఞాసువులకు సుఖబోధకమగుటకు ఈ శ్వేతాశ్వతరోపనిషత్తు వ్యాఖ్యానరూపంలో అల్పగ్రంథం ప్రారంభించబడు చున్నది. ఆత్మ సచ్చిదానందాద్వితీయ బ్రహ్మ స్వరూపమయినప్పటికీ తననే ఆశ్రయము విషయము చేసుకునే 'నేను అజ్ఞానిని' అను తన అనుభవం చేతనే తెలియబడే చిదాభాసయుక్త అవిద్యచేత జీవాత్మయొక్క అన్ని రకాలైన స్వాభావికమైన పురుషార్థాలు నిరోధించబడి సమస్త అనర్థాలు సంభవించినవి. జీవుడు అజ్ఞానంచేత కల్పన చేయబడిన సాధనల చేతనే తన ఇష్టప్రాప్తి రూప అపురుషార్థాలనే పురుషార్థాలనుకుని పరమ పురుషార్థ రూప మోక్షాన్ని పొందని కారణం చేత మొసల్లవలె రాగాది దోషాలచేత రకరకాల విషయాదులలోకి లాగబడి దేవ, మనుష్య, తిర్యగాది విభిన్న యోనులందు సంచరిస్తూ వుంటాడు. ఏదో ఒక పూర్వ పుణ్యకర్మచేత బ్రహ్మవిద్యాధికారం గల బ్రాహ్మణాది శరీరాన్ని పొంది ఈశ్వరార్పణగా పుణ్యకర్మానుష్ఠానం చేసినందువలన రాగాది మాలిన్యం నుండి విముక్తిని బొంది సమస్త సుఖాలను అనిత్యంగా భావించి ఇహపర సుఖాల నుండి విరక్తుడవుతాడు. తరువాత యోగ్యుడగు గురువు దగ్గరికి వెళ్లి ఆయన ద్వారా వేదాంత శ్రవణాదులను చేసి "నేను బ్రహ్మమును' అను బ్రహ్మాత్మ తత్త్వ సాక్షాత్కారాన్ని బొంది జీవుడు అజ్ఞాన కార్యాల నుండి విముక్తుడయి శోక రహితుడవుతాడు. అజ్ఞాన నివృత్తియే మోక్షమయినందున ఆ జ్ఞానాన్ని బోధించే ఉపనిషత్తును ప్రారంభించుట ఉచితము.

పై విషయాన్నిబోధించు అనేక ఉపనిషత్తుల ఉదాహరణలు సూచిస్తున్నారు.

శం.భా. తథా తద్విజ్ఞానాదమృతత్త్వమ్. "తమేవం విద్వానమృత ఇహ భవతి" (నృ.పూ.ఉ.) నాఽన్యః పంథా విద్యతేఽయనాయ (శ్వేత. ఉ.) "న చేదిహావేదీన్మహతీ వినష్టిః" (కేన.ఉ.) "య ఏతద్విదురమృతాస్తే భవన్తి" (బృ.ఉ.) "కిమిచ్ఛన్ కస్య కామాయ శరీరమనుసన్జ్వరేత్" (బృ.ఉ.) "తం విదిత్వా న లిప్యతే కర్మణా పాపకేన" (బృ.ఉ.) "తరతి శోకమాత్మవిత్" (ఛా.ఉ.). "నిచాయ్య తన్మృత్యుముఖాత్ ప్రముచ్యతే" (కఠ.ఉ.) "ఏతద్యో వేద నిహితం గుహాయం సో ఽ విద్యాగ్రన్థిం వికిరతీహ సోమ్య" (ము.ఉ.) "భిద్యతే హృదయగ్రన్థిశ్ఛిన్ద్యన్తే సర్వసంశయాః। క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్దృష్టే పరావరే ॥" (ముం.ఉ.)

"యథా నద్యః స్యన్దమానాః సముద్రేఽస్తం గచ్ఛన్తి నామరూపే విహాయ।

తథా విద్వాన్నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్ ॥" (ముం.ఉ.)

" స యో హ వై తత్పరమం బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" (ముం.ఉ.) "స యో హ వై తదచ్ఛాయమశరీరమలోహితం శుభ్రమక్షరం వేదయతే యస్తు సోమ్య" (ప్రశ్న.ఉ.) "స సర్వమవైతి" "తం వేద్యం పురుషం వేద యథా మా వో మృత్యుః పరివ్యథాః" (ప్రశ్న.ఉ.) "తత్ర కో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః" (ఈశ.ఉ.) "విద్యయాఽమృతమశ్నుతే" (ఈశ.) "భూతేషు భూతేషు విచిత్య ధీరాః ప్రేత్యాస్మాల్లోకాదమృతా భవన్తి" (కేన.ఉ.) "అపహత్య పాప్మానమనన్తే స్వర్గే లోకే జ్యేయే ప్రతితిష్ఠతి" (కేన) "తన్మయా అమృతా వై బభూవుః" (శ్వేత.ఉ.) "తద్వాత్మ తత్త్వం ప్రసమీక్ష్య దేహీ ఏకః కృతార్థో భవతే వీతశోకః" (శ్వే.ఉ.) "య ఏతద్విదురమృతాస్తే భవన్తి" (బృ.ఉ.) "తదేవోపయన్తి" "నిచాయ్యేమాం శాన్తిమత్యన్తమేతి" (కఠ.ఉ.) "తమేవం జ్ఞాత్వా మృత్యుపాశాంశ్ఛినత్తి" (శ్వేత.ఉ.) "యే పూర్వం

దేవా ఋషయశ్చ తం విదుః" (శ్వేతా. ఉ.) "తేషాం శాన్తిః శాశ్వతీనేతరేషామ్" (కఠ. ఉ.)

"బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే । (భ.గీ. 2-50)

"కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।

జన్మబన్ధవినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్" ॥ (భ.గీ. 2-51)

"సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సన్తరిష్యసి" (భ.గీ. 4-36)

"జ్ఞానాగ్ని సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా" (భ.గీ. 4-37)

"ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్స్యాత్ కృతకృత్యశ్చ భారత" (భ.గీ. 15-20)

"తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్" (భ.గీ. 18-55)

""సర్వేషామపి చైతేషామాత్మజ్ఞానం పరం స్మృతమ్।

"తద్ధ్యగ్ర్యం సర్వవిద్యానాం ప్రాప్యతే హ్యమృతం యతః ।

ప్రాప్యైతత్ కృతకృత్యో హి ద్విజో భవతి నాఽన్యథా ॥"

"ఏవం యః సర్వభూతేషు పశ్యత్యాత్మానమాత్మనా ।

స సర్వసమతామేత్య బ్రహ్మాభ్యేతి సనాతనమ్ ॥"

"సమ్యగ్దర్శనసమ్పన్నః కర్మభిర్న నిబధ్యతే ।

దర్శనేన విహీనస్తు సంసారం ప్రతిపద్యతే ॥"

"కర్మణా బధ్యతే జన్తుః విద్యయా చ విముచ్యతే ।

తస్మాత్కర్మ న కుర్వన్తి యతయః పారదర్శినః॥ "

"జ్ఞానం నిఃశ్రేయసం ప్రాహుర్ వృద్ధా నిశ్చయదర్శినః ।

తస్మాజ్ జ్ఞానేన శుద్ధేన ముచ్యతే సర్వపాతకైః॥ "

"ఏవం మృత్యుం జాయమానం విదిత్వా జ్ఞానేనవిద్వాంస్తేజ అభ్యేతి నిత్యమ్।

న విద్యతే హ్యన్యథా తస్య పన్థాస్తం మత్వా కవిరాస్తే ప్రసన్నః ॥"

"క్షేత్రజ్ఞస్యేశ్వరజ్ఞానాద్విశుద్ధిః పరమా మతా ।

అయం తు పరమో ధర్మో యద్యోగేనాత్మ దర్శనమ్॥ "

"ఆత్మజ్ఞః శోకసంతీర్ణో న బిభేతి కుతశ్చన ।

మృత్యోః సకాశాన్మరణాదథవాన్యకృతాద్భయాత్ ॥

"న జాయతే న మ్రియతే న వధ్యో న చ ఘాతకః ।

న బధ్యో న బన్ధకారీ వా న ముక్తో న చ మోక్షదః ॥

"పురుషః పరమాత్మా తు యదతోఽన్యదసచ్చ తత్ ।"

ఏవం శ్రుతిస్మృతీతిహాసాదిషు జ్ఞానస్యైవ మోక్షసాధనత్వావగమాద్వ్యుజ్యత ఏవోపనిషదారమ్భః ।

అనువాదం – బ్రహ్మాత్మజ్ఞానంతో అమృతత్వాన్ని పొందుతారు. 'ఆ తత్త్వాన్ని తెలిసికున్నవాడు ఈ లోకంలోనే ముక్తుడౌతాడు. 'మోక్షప్రాప్తికొరకు వేరే మార్గమే లేదు.' 'ఈ లోకంలో తత్త్వాన్ని తెలిసికోలేకపోతే చాలా నష్టం కలుగుతుంది. 'ఈ తత్త్వాన్ని తెలిసికున్నవారు అమరులవుతారు. 'ఆ తత్త్వమే నేనను దృఢజ్ఞానం కలవారు ఏ కోరికతో శరీరాన్ని గురించి సంతృప్తులవుతారు'. 'తత్త్వాన్ని అనుభవించిన తరువాత మృత్యుముఖం నుండి విడవబడతారు.' 'బుద్ధిగుహాయందు నిహితమైవున్న దానిని తెలిసికున్నవారు అవిద్యారూప గ్రంథిని ఛేదిస్తారు.' 'ఆ పరమాత్మను సాక్షాత్కారించినవారి హృదయగ్రంథులు ఛేదింపబడతాయి. సర్వసంశయాలూ నివారింపబడతాయి. సమస్త కర్మ సంస్కారాలు నశిస్తాయి.' 'సమస్త నదులు ప్రవహిస్తూ ప్రవహిస్తూ సముద్రంలో లీనమై

తమతమ నామరూపాలను కోల్పోయినట్లు ఆత్మతత్త్వజ్ఞుడగువాడు తమ నామరూపాలను వదలి పరమాత్మ యందు లీనమవుతాడు.' 'ఆ పరబ్రహ్మమును తెలిసిన వాడు పరబ్రహ్మమే అవుతాడు.' 'ఓ సౌమ్య! ఛాయారహితమైన అశరీరుడు అలోహితుడు శుద్ధ అక్షర పరమాత్మను తెలిసికున్న వాడు సర్వజ్ఞుడే.' ' అతను సర్వం తెలిసినవాడు. తెలియవల్సిన తత్త్వాన్ని తెలిసికున్న వానిని మృత్యువు బాధించదు.' 'ఏకత్వ దర్శనం గలవానికి శోకమోహము లుండవు. "విద్యచేత అమృతత్త్వాన్ని బొందుతాడు.' 'జ్ఞానియైనవాడు సమస్త భూతాలయందు తత్త్వాన్ని దర్శిస్తూ ఈ శరీరాన్ని వదలిన తరువాత అమృతస్వరూపుడవుతాడు.' 'పరతత్త్వజ్ఞాని పాపవిముక్తుడై వినాశరహిత సుఖమయ స్వయం ప్రకాశ పరబ్రహ్మమందు ప్రతిష్ఠుడౌతాడు. 'బ్రహ్మస్వరూపులైన వారు నిశ్చయంగా అమరులవుతారు.' ' శరీరియగువాడు ఆత్మసాక్షాత్కారాన్ని బొంది శోకరహితుడై కృతార్థుడగు చున్నాడు.' 'ఆత్మతత్త్వాన్ని తెలిసినవాడు అమరుడవుతాడు.' 'ఈశ్వరుని తెలిసికుని అమరులగుచున్నారు.' 'దానినే పొందుచున్నారు' 'ఆత్మ తత్త్వానుభవం పొంది జీవులు పరమశాంతులగుచున్నారు.' 'తత్త్వాన్ని తెలిసికుని మృత్యుపాశాన్ని ఛేదిస్తున్నారు.' 'పూర్వులగు ఋషులు, దేవతలు ఆ తత్త్వాన్ని తెలిసినవారు.' 'ఆత్మతత్త్వం తెలిసినవారికే శాశ్వత పరమశాంతి ఇతరులకు లేదు.' 'సమత్వయోగవిషయక బుద్ధియుక్తులైనవారు జ్ఞానప్రాప్తి ద్వారా ఈ లోకంలోనే పుణ్యపాపాల్ని వదలివేస్తారు.' 'సమత్వ బుద్ధిగలిగిన జీవులు కర్మ జన్మ ఫలాన్ని త్యాగం చేసి జన్మమరణ బంధ విముక్తులై జ్ఞానులై సమస్త ఉపద్రవరహిత మోక్షమును బొందుచున్నారు.' 'నీవు జ్ఞానస్వరూప నావ ద్వారానే సంపూర్ణ పాపాలనుండి విముక్తుడవవుతావు.' 'జ్ఞానాగ్ని సర్వ పాపాలను భస్మం చేస్తుంది.' 'ఈ రహస్యమైన శాస్త్రాన్ని తెలిసికుని బుద్ధిమంతుడవు కృతకృత్యుడవుతావు.' ' అందువలన నన్ను యథార్థంగా తెల్సుకుని తత్కాలం నాలో ఐక్యమవుతావు' 'సమస్త

సాధనలలో ఆత్మజ్ఞానమే శ్రేష్ఠమైనది. అలాగే సమస్త విద్యలలో గూడ ఆత్మ విద్యయే శ్రేష్ఠమైనది. ఎందుకంటే దీని ద్వారానే అమృతత్వ ప్రాప్తి గలుగుతుంది. దీనిని బొందినందువలననే జీవుడు కృతకృత్యుడవుతాడు. ఇంతకుమించి వేరే మార్గమే లేదు. ఈరకంగా సమస్త జీవులందు ఆత్మను చూచువాడు సమస్తమందు సమబుద్ధినిబొంది సనాతనమైన బ్రహ్మమును బొందుతాడు. ఈలాంటి సమ్యగ్ దృష్టిగలవాడు కర్మబంధాన్ని బొందడు. ఈ దృష్టి లేనివాడు జనన మరణ రూప సంసారాన్ని పొందుతాడు. కర్మచేత జీవుడు బద్ధుడవుతాడు కాని జ్ఞానం చేతనే ముక్తుడవుతాడు. అందువలన దూరదృష్టి గల మునులు కర్మను చేయరు. స్థిరబుద్ధిగలిగిన ప్రాచీన ఆచార్యులు ఆత్మజ్ఞానాన్నే మోక్షసాధనగా చెప్పారు. అందువలన శుద్ధజ్ఞానం చేతనే జీవుడు సంపూర్ణ పాపవిముక్తుడవుతాడు.' 'ఈరకంగా మృత్యువును అవశ్యంభావిగా తెల్సుకుని విద్వాంసుడగువాడు జ్ఞానం ద్వారా నిత్య తేజఃస్వరూపమైన బ్రహ్మమును బొందుతాడు. దీనికి మించి మోక్షానికి వేరే మార్గం లేనే లేదు. ఈ రహస్యాన్ని తెలిసికున్న జీవుడు ప్రసన్నచిత్తుడౌతాడు.' 'క్షేత్రజ్ఞుడగు ఈశ్వరజ్ఞానం చేతనే జీవుని ఆత్యంతిక శుద్ధిచెప్పబడింది.' 'యోగసాధన ద్వారా ఆత్మసాక్షాత్కారం చేసుకోవడమే పరమధర్మము.' 'ఆత్మజ్ఞానంచేత సమస్త శోకవిముక్తుడై మరణాదులు లేదా వేరే ఇతరం ద్వారా కలిగే భయాలకు భయపడడు.' 'పరమాత్మ ఉత్పన్నమయ్యేవాడు కాడు. మరణించేవాడూ కాడు. ఆత్మను ఎవరూ చంపలేరు, ఆత్మ ఎవరినీ చంపదు. అది ఎవరి ద్వారా బంధింపబడదు, ఎవరినీ బంధించదు గూడ. అది ముక్తం కాదు, మోక్షప్రదమూ కాదు. పరమాత్మ ఒక్కటే సత్యము. దీనికి భిన్నంగా గోచరించే సమస్తమూ అసత్యమే.' ఈవిధంగా శ్రుతిస్మృతి ఇతిహాసాదులు జ్ఞానమే మోక్ష సాధనమని తెలిపినందున జ్ఞానసాధకమైన ఉపనిషత్తును ప్రారంభించుట ఉచితమే. (సశేషం)

కర్మ

– శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు,

(శ్రీ శుకబ్రహ్మాశ్రమము)

కర్మ అంటే పని అని అర్థము. కర్మను చేసేవి కర్మేంద్రియాలు. అంటే వాక్కు పాణి పాదవాయువు ఉపస్థలనేవి. నోటితో మాట్లాడుట, చేతితో పట్టుకొనుట విడుచుట, పాదాలతో నడుచుట, పాయువుతో మల మూత్ర విసర్జనము. ఉపస్థతో ఆనందించుట అన్నవి కర్మేంద్రియాల పనులు. కంటితో చూస్తున్నాను. చెవులతో వింటున్నాను ఇత్యాది మాటలు పనులను సూచిస్తున్నా గూడా అవి యథార్థమైన పనులు కావు. త్వక్కు అంటే చర్మము, కళ్ళు, చెవులు, నాలుక ముక్కు అనేవి జ్ఞానేంద్రియాలు. వీటి ద్వారా చూడటము, వినటము, స్పర్శనుగ్రహించుట,రుచి గంధాలను తెలుసు కొనటము మనసే, అంటే అంతఃకరణమే చేస్తున్నది.

జంగమాత్మకమైన సకల జీవులు నిరంతరము ఏదో ఒక కర్మను చేస్తూనే వుంటాయి. వీటిలో తిర్యక్కులు, అంటే పశుపక్షి జలచర సరీసృప (సర్పాదులు) క్రిమికీటకాదుల ఉపాధులు కేవలము కర్మఫలానుభవానికి మాత్రమే కలిగినవి. ఈ జంతువులు చేసే కర్మలు వాటి శరీరపరమైన ఆహార నిద్రమైథునాలకు మాత్రమే పరిమితమైనవి. వాటి కర్మలకు పుణ్యపాప ఫలాభిసంధి వుండదు.

మానవులు చేసే కర్మ రెండు విధాలుగా వున్నది. మొదటిది అసంకల్పిత కర్మ, రెండవది సంకల్ప పూర్వక కర్మ. అంటే కోరికలు పూర్తి చేసుకొనడానికి చేసే కర్మ కంటిరెప్పలు నిరంతరము ఆడుతూ వుండుట, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అనే శ్వాసక్రియ, ఆవులింత, తుమ్ములు, దగ్గు త్రేనుపు శరీరము వణకుట ఇత్యాది క్రియలు మనసు యొక్క సంకల్పము లేకుండానే

జరుగుతుంటాయి. ఇవన్నీ శరీర నిర్వాహక క్రియలు, లేక పనులు. వీటి వలన కేవలము శరీరము పోషించబడుతూ సక్రమంగా వుంచ బడుతుంది. వీటికి పుణ్య పాపఫలజనక శక్తి వుండదు కాబట్టి ఇవి మనిషికి బంధకరములు కావు.

ఇక రెండవదైన సంకల్ప పూర్వక కర్మనే మానవుడి సంసార బంధానికి కారణమౌతున్నది. ఇటువంటి కర్మను మనిషి ఎందుకు చేస్తాడు? –ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖంగా,సంతోషంతో వుందా మనేదే దానికి ఏకైక లక్ష్యము.

మనిషి కర్మ చెయ్యడాన్ని తల్లి గర్భంలో వున్నప్పటి నుండే మొదలు బెట్టుతున్నాడు. కాళ్ళు, చేతులను చాపుకోలేకను, లేత శరీరాన్ని అనేక క్రిములు కుట్టే బాధను ఓర్చుకోలేకను, దానిలోని వేడిని ఓర్చుకోలేకను, కాస్త సుఖంగా వుందామని, ఆ చిన్న సంచీలో నిరంతరము తిరుగుతూ అవయవాలను కదిలిస్తూ ప్రయత్నాన్ని చేస్తుంటాడు.

తరువాత ప్రపంచంలోకి వచ్చి బోర్లపడటము, పాకటము, కూర్చోవటము, నిలబడటము, నడవటము,మాట్లాడటము ఇత్యాది కర్మలను చేస్తుంటే అతడి తల్లితండ్రులు మొదలైనవారు చాలా ఆనందపడుతూ వేడుకలను చేసుకుంటారు. కానీ ఆ శిశువు మాత్రము తన చుట్టూ కనబడుతున్న వస్తువులు, మనుష్యులు మొదలైన అన్నిటినీఉపయోగించుకుని సంతోషిచాలనే తీవ్రమైన ప్రయత్నాలను చేస్తుంటాడు. అంత చిన్నగా, అమాయకంగా కనబడుతున్నా గూడా ఆ శిశువులో అనేక జన్మల వాసనల భాండాగారము వున్నదని సామాన్యులైన వారికి ఏ మాత్రమూ తెలియదు. ఒక నలుసు వంటి విత్తనంలో మహావటవృక్షముందని అవివేకులకు తెలియదు గదా!

ఇక పిల్లవాడు పెరుగుతూ జీవితంలో తన కోరికలను తీర్చుకుని సంతోషించడానికి చేసే కర్మలు పెద్దలకంగీకారమైనవైతే, శాస్త్రాను సారమైనవైతే సంతోషము, కానట్లైతే విషాదాన్ని పొందుతున్నాడు. కర్మలను సుఖసంతోషాల కోసమే చేస్తున్నా అవి ధర్మబద్ధమైనవైతే సుఖాన్నీ, ధర్మ విరుద్ధమైనవైతే దుఃఖాన్నీ కలిగిస్తాయి.

"పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః

న పాపఫల మిచ్ఛంతి పాపం కుర్వన్తి యత్నతః"

అని పెద్దల వచనము. దీని అర్థము-మానవులు పుణ్యకర్మల ఫలమైన సుఖాన్ని ఆశిస్తారు. కానీ దానికి కారణమైన సత్కర్మను చెయ్యడానికి ఇష్టపడరు. పాపకర్మఫలమైన దుఃఖాన్ని ఇష్టపడరు గానీ దుఃఖానిచ్చే పాపకర్మను ప్రయత్నించి చేస్తారు అని. ఎందుకీవిధంగా చేస్తారు అన్నదానికి శ్రీమద్భగవద్గీత మూడవ అధ్యాయంలో సమాధానము చెప్పబడింది.

"కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః

మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణం"

రజోగుణము వలన పుట్టిన కోరిక(లు) అన్నదీ, ఆ కోరిక(ల)ను పూర్తి చేసుకోవడానికి కలిగే అంతరాయాల మీద కోపము అన్నదీ పాపకర్మాచరణకు మూలము. కోరిక మహా తిండిపోతు (అంతులేనిది). ఇదే మనిషికి శత్రువు అని అర్థము.

కర్మ బంధము అంటే ఏమిటి? - మనిషికి, అంటే జీవికి కర్మ ఫలానుభవాన్ని పొందించడానికి అనేకమైన యోనులను కలిగించి వాటిలో సుఖదుఃఖాలను అనుభవింపజేసే దానికి కర్మబంధము అని పేరు, జీవిని

సుఖదుఃఖ పరంపరలో బంధిస్తుంది అని అర్థము.

మానవుడు చేసిన కర్మకు ఫలము రెండు విధాలుగా లభిస్తుంది. ఒకటి కర్మ జరిగిన వెంటనే లభించేది. రెండవది భవిష్యత్తు కాలంలో లభించేది.

దప్పిక కలిగినప్పుడు నీరు త్రాగగానే ఆ దప్పిక తీరిపోతుంది. ఆకలి వేసినప్పుడు ఆహారాన్ని తీసుకోగానే ఆకలి తీరిపోతుంది. స్నానము చెయ్యగానే హాయిగా వుంటుంది. అగ్నిని ముట్టుకోగానే చెయ్యి కాలుతుంది, సూది గుచ్చుకోగానే బాధ కలుగుతుంది. ఇటువంటివన్నీ సుఖ దుఃఖాత్మకమైన సద్యఃఫలాన్నిచ్చే కర్మలు. ఈ సద్యఃఫలాన్నిచ్చే కర్మల వలన మనిషికి చెప్పుకోదగిన బంధమనేది ఉండదు.

వరి మొదలైన విత్తనాలు భూమిలో నాటిన కర్మకు కొన్ని మాసాలానంతరము ఫలితము కలుగుతుంది. మామిడి, కొబ్బరి మొదలైన విత్తనాల వలన కొన్ని సంవత్సరాలకు ఫలము లభిస్తుంది. ఇవి కృషికి లభించే ఫలాలు.

ఇక వేదవిహితమైన ఇష్టాపూర్త దత్త కర్మలకు సుఖరూప ఫలము భవిష్యత్తు కాలములో లభించవచ్చును - అనగా ఆ ఫలాలు ఒకే జన్మలో లభించవచ్చును. లేదా మరణానన్తరముగానీ, లేదా అనేక జన్మాంతరాలలో లభించవచ్చును. ఐతే ఫలము మాత్రము తప్పక లభిస్తుంది. ఇహపరలోక కోరికలను తీర్చుకొనడానికి ఆచరించే యజ్ఞాదికర్మలు ఇష్టులు. పదిమందికి ఉపయోగపడే బావులు, చెరువులు, దేవాలయాలు, ధర్మశాలలు, పాఠశాలలు, ఆటస్థలాలు, ఉపవనాలు ఇత్యాదులను నిర్మించడమనే కర్మలు పూర్తాలు. అన్న ధన వస్త్ర గృహ భూమి ఇత్యాదుల దానకర్మలు దత్తాలు. ఇవన్నీ సత్కర్మలు. ఇక వేదనిషిద్ధ దుష్కర్మలైన అసత్య,హింస,చౌర్య, ద్రోహ, మోస

కృతఘ్నత ఇత్యాదులకు దుఃఖరూప ఫలము కాలాంతరములో లభిస్తుంది.

మరి ఒకప్పుడు చేసిన కర్మలకు కాలాంతరంలోనూ, వేరు జన్మలలోనూ ఫలము లభించడము ఎందువలన?- దీనికి రెండు కారణాలు. సర్వసుఖాలను లభింపజేసే యజ్ఞాది కర్మలను ఆచరించిన తత్క్షణమే కుటుంబాన్నీ,శరీరాన్నీ వదిలేసి స్వర్గానికి వెళ్ళిపోవాలని ఎవ్వరూ అనుకోరు గదా! సత్యనారాయణస్వామివారు, తన వ్రతాన్ని శ్రద్ధగా చేసిన నూతన దంపతులయందు ప్రసన్నుడై, వారిని వైకుంఠానికి తీసుకుని వెళ్తానంటే శరీరాలను వదిలేసి అప్పటికప్పుడు వెళ్ళడానికి ఆ దంపతులు ఒప్పుకుంటారా? వారి సంబంధీకులైనా ఇష్టపడతారా?

కర్మ ఫలమన్నది మూడు విధాలుగా వున్నది. అవి సంచితము, ప్రారబ్ధము, ఆగామి అన్నవి. సంచితము అంటే వర్తమాన జన్మ కన్నా పూర్వమైన జన్మలలో ఆచరించిన కర్మకు భవిష్యత్తులో పొందవలసిన ఫలము. సామాన్యమైన మనిషికి అంతకు పూర్వము అనేక జన్మలు (శతకోటి జన్మలు అని జ్ఞానులు తెలిపారు) గడిచాయి. ఒక జన్మలో చేసిన మిశ్రమ కర్మల ఫలాలను అనుభవించడానికి ఆ జన్మ చాలనప్పుడు మరికొన్ని జన్మలు అవసరమౌతాయి. చేసిన కర్మక్రమంలోనే వాటి ఫలాలు గూడా ప్రాప్తిస్తాయి. అందుచేత కర్మ చేసిన వెంటనే దాని ఫలము లభించే అవకాశము లేదు. ప్రారబ్ధకర్మ ఫలశేషము వున్నంతవరకు ఏమనిషైనా శరీరాన్ని విడిచివెళ్ళడానికి వీలుపడదు. ఒకవేళ ఆత్మహత్యలు చేసుకున్నట్లయితే దానికి సంబంధించిన పాపాన్ని మరొక జన్మలో ఆదనంగా అనుభవించవలసి వుంటుంది.

ఒక మరొక సందేహము కలగవచ్చును-ఈ శరీరముతో ఈ లోకములో చేసిన కర్మలకు మరొకచోట మరొక శరీరముతో ఫలాన్ని అనుభవించటము ఎట్లా సమంజసము? అని -కర్మను చేసేదీ దాని ఫలాన్ని అనుభవించేదీ కూడా అంతఃకరణములోని అహంకారమే (దీన్నే మనసు అని సామాన్యులు అంటారు). చేసిన అన్ని కర్మలయొక్క సంస్కారము, దాని ఫలానుభవము వరకు చిత్తంలో నిక్షిప్తమై వుంటుంది. కాలగమనంతో శరీరము నశించిపోయినా గూడా దానిలోని అంతః కరణములోని అహంకారమే (దీన్నే మనసు అని సామాన్యులు అంటారు) చేసిన అన్ని కర్మలయొక్క సంస్కారము, దాని ఫలానుభవము వరకు చిత్తంలో నిక్షిప్తమై వుంటుంది. కాలగమనంతో శరీరము నశించి పోయినా గూడా దానిలోని అంతఃకరణానికి మాత్రము ఎటువంటి హాని కలగదు. అది పంచభూతాలచేత నశించనిది. అందుచేత ఆ అంతఃకరణమే ఇతర లోకాలలో గానీ, లేక మరికొన్ని శరీరాలను నిర్మించుకుని వాటి ద్వారా తను సంపాదించిన కర్మఫలాన్ని ఎన్నటికైనా అనుభవిస్తుంది.

జీవులు ఈ కర్మఫలానుభవ చక్రమునుండి ఏవిధంగా బయట పడగలరు? తాము ఆచరించిన పుణ్యపాపకర్మల ఫలాన్ని అనుభవించడానికి దేవతల ఉపాధులు అనే ఉత్తమ సౌఖ్య జన్మలను మొదలుకొని క్రిమికీటక స్థావరాత్మకమైన అధమ జన్మలను పొందుతుంటారు. పెనుతుఫాను వలన కలిగిన సముద్రపు కల్లోలమైన తరంగాలలో ఒక ఎండిపోయిన సొరకాయ బుఱ్ఱ పైకీక్రిందకీ తన్నుకుంటున్నట్టు జీవులు సంసారంలో తిరుగుతున్నారు అని శ్రీసురేశ్వరాచార్యులవారు తమ "నైష్కర్మ్యసిద్ధి" అనే గ్రంథంలో వచించారు. ఈ అపార యాతనను నివృత్తి చేసుకుని శాశ్వత శాంతిని సాధించుకునే మార్గాలను శ్రుతి స్మృతి పురాణాలైన ఉపనిషత్తులు, శ్రీమద్భగవద్గీతాది స్మృతులు, శ్రీమద్భాగవతము అనే తత్త్వబోధక శాస్త్రాలు మనకు విస్తారంగా తెలియజేశాయి.

కర్మలనేవి స్వయంగా మనిషికి బంధకరాలు కావు, వాటి వెనుక గల ఉద్దేశ్యమే బంధానికి కారణమౌతున్నది. న్యాయస్థానము విధించిన చిన్న శిక్షలు మొదలుకొని ఉరిశిక్షల వరకు గల ఎన్నింటిచేతనో, పోలీసు సిబ్బంది నేరస్థులకు బాధలను కలిగిస్తుంది. పాపకర్మ వలె కనిపించినా అది శిక్షను అమలు చేసేవారికి పాపాన్ని కలిగించి నరకయాతనను పొందించదు. ఇక ఏవైనా జాతీయ ఉత్సవాల సందర్భాన ఖైదీలకు మంచి భోజనాలను, కొత్త వస్త్రాలను పంచిపెట్టినా వాటి వలన జైలు సిబ్బందికి పుణ్యఫలము ప్రాప్తించి స్వర్గసుఖము కలుగదు. ఎందువలన వారు చేసిన కర్మ వారిని బంధించదు? అంటే వారు కేవలము ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ తమ ఉద్యోగ ధర్మ నిర్వహణము చేశారు. అదేవిధంగా వేదము ద్వారా పరమాత్మ ప్రోక్తమైన విధ్యుక్త ధర్మానుసారమైనవి అనే భావనతో చేసిన కర్మలు మనిషికి బంధకరములు కావు.

కర్మ ఫలాన్ని ఆశించకుండా చేసిన కర్మ, అంటే నిష్కామ కర్మ మనిషిని బంధించదు. కర్మ ఫలాన్ని ఆశించకబోతే కర్మలు చెయ్యడము ఎందుకోసము? అనే ప్రశ్న వస్తుంది. కర్మఫలాన్ని ఆశించకబోవటము అంటే కర్మ ఫలాన్ని పొంది ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖంగా జీవిస్తాను అనే అర్థము. ఆవిధంగా గాక స్వధర్మ కర్మను పరమాత్మ సంతోషించాలనే భావనతో చేస్తే అది బంధకరము కాదు.

"బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః।

లిప్యతే న స పాపేన పద్మపత్ర మివాంభసా । శ్రీమద్భగవద్గీత - 5

"యజ్ఞార్థాత్ కర్మణోఽ న్యత్ర లోకోఽ యం కర్మ బంధనః శ్రీమద్భగవద్గీత-3

"బుద్ధియుక్తో జహాతీహ ఉభేసుకృత దుష్కృతే । శ్రీమద్భగవద్గీత - 2

తస్మాద్యోగాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి ॥

ఈ విధంగా నిష్కామ కర్మను చేయడము వలన అంతఃకరణము శుద్ధమై, అంటే లౌకిక విషయ భోగాల మీద కోరికలు తగ్గి కామక్రోధాదులు ఉపశమిస్తాయి. తరువాత అంతఃకరణము స్వరూపజ్ఞానాన్ని పొందడానికి యోగ్యమౌతుంది.

"స్వకర్మణా త మభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః" శ్రీమద్భగవద్గీత -18

తన స్వధర్మము చేత పరమాత్మను ఆరాధించి మానవుడు ఆయనను చేరుతాడు అని అర్థము.

స్వరూప జ్ఞానము అంటే ఏమిటి?- మనిషి శరీరములో మూడు భాగాలున్నాయి.

1. రక్తమాంసాది సప్తధాతుమయమైన కనబడే స్థూలశరీరము. 2. ఇంద్రియ ప్రాణ అంతఃకరణ కూడలి ఐన సూక్ష్మ శరీరము. 3. చైతన్యము లేక ప్రత్యగాత్మ. ప్రత్యగాత్మ అంటే పరమాత్మనే. శరీరము లోపల ఉండటము వలన ఆ పేరు కలిగింది. నేను అనే శబ్దము యథార్థంగా ప్రత్యగాత్మనే సూచిస్తున్నది. కానీ ఆ జ్ఞానము లేని సామాన్యులందరికీ నేను అంటే శరీరమే అని అనిపిస్తుంది. ప్రపంచములోని కార్యకలాపమంతా శరీరమే చేస్తున్నది కాబట్టి.

శరీరము ద్వారా అనుభవిస్తున్నదంతా మూడు విధాలుగా చెప్పబడింది. వీటికి షడూర్మ్మలు అని పేరు. శరీరధర్మాలైన జనన మరణాలు, ప్రాణధర్మాలైన ఆకలి-దప్పికలు, మనోధర్మాలైన సుఖ దుఃఖాలు. సూక్ష్మ శరీరములోని అహంకారము (సామాన్యుల భాషలో మనసు) స్థూల శరీరము ద్వారా ప్రాపంచిక విషయాలను గ్రహించి

అనుభవిస్తుంది. నేను చేస్తున్నాను. నేను అనుభవిస్తున్నాను అన్న భావాలు యథార్థంగా అహంకారానివే. ఐతే ప్రత్యగాత్మకూ, అహంకారానికి గల భేదాజ్ఞానము చేత కర్తృత్వభోక్తృత్వభావాలు ప్రత్యగాత్మకు ఆపాదించ బడుతున్నాయి.

ప్రత్యగాత్మ కేవలము చైతన్యము,అవ్యయము (నాశరహితము), అసంగము (దేనిచేతనూ అంటుపడనిది), ఆనందమాత్రము.

స్వరూప జ్ఞానము అంటే నేను శరీరమనసులనేవి కాను, కేవలము ప్రత్యగాత్మను మాత్రమే అనే జ్ఞానము. ప్రత్యగాత్మను కర్మ ఫలాలన్నవి స్పృశించలేవు.

ఎప్పుడు జీవి అహంకార తాదాత్మ్యాన్ని వదిలిపెట్టి తన ప్రత్యగాత్మ స్వరూపంలో నిలబడుతుందో అప్పుడు అహంకారము చైతన్యరహితమై ఒక జడ వస్తువు లాగా మిగిలిపోతుంది. ఇక దానికి కార్యకలాపము, ఫలానుభవము అన్నవి వుండవు.

ఇదే కైవల్యస్థితి, మోక్షస్థితి, బ్రాహ్మీస్థితి అనే పేర్లతో చెప్పబడింది.

స్వరూపజ్ఞానము, దాని అపరోక్షానుభవము బ్రహ్మస్వరూపులైన గురువుల శుశ్రూష బోధలచేత లభిస్తుంది. పరమాత్మ ప్రీత్యర్థము చెయ్యబడిన కర్మలవలన బ్రహ్మజ్ఞానుల సాంగత్య శుశ్రూష బోధలు లభిస్తాయి.

అందుచేత సర్వకర్మలను ఆవిధంగా ఆచరించి, కర్మఫలబంధాన్ని కలిగించుకోకుండా,సంసారచక్రాన్ని అంతం చేసుకుని ప్రత్యగాత్మ స్వరూపంలో నిలిచి, శాశ్వతంగా, ఆనందంగా వుండటమే మానవ జన్మ యొక్క ముఖ్యోద్దేశ్యము.

ఓం తత్ సత్

భగవాన్ లీలలు

శ్రీ భగవాన్ వంటశాలలోకి వెళ్ళి మామూలుగా వంట పనులను పర్యవేక్షించేవారు. స్వయంగా ఇడ్లీలకు పిండి రుబ్బేవారు, పచ్చళ్ళను నూరేవారు, సాంబారులోకి ముక్కలను తరిగి సాంబారు మరుగుతున్న గిన్నెలో వేసి కలియ బెట్టేవారు. అట్లా చేస్తూండగా ఒకసారి గిన్నెలోంచి ఒక ఉడుకుతున్న ముక్క ఎగిరి వారి వేలి మీద పడింది. దాని వల్ల వేలిపై పెద్ద బొబ్బలేచింది. "ఏమిటది" అని ఎవరో అడిగితే "ఇది నా కొత్త ఉంగరము" అన్నారు శ్రీ భగవాన్.

కాయగూరలను, ఆకు కూరలను అతి పొందికగా తరిగేవారు. నేలమీద ఒక్క ఆవగింజ పడినా దానిని ఎత్తి తీసుకువెళ్ళి డబ్బాలో వేసేవారు. తమరు ఎందుకింత పట్టించుకుంటారు? అని అడిగితే "ఇదంతా అరుణా చలుని సొత్తు. దానిని భద్రంగా ఉంచే బాధ్యత నాది" అనేవారు. దేనినీ వృథా చేయకూడదని శ్రీభగవాన్ చెప్తూండేవారు.

వంట విషయంలో శ్రీ భగవాన్ పరిపూర్ణులు. మాతో చాలా నిష్కర్షగా వుండేవారు. వారి ఆజ్ఞలను తు.చ. తప్పకుండా పాటించాలని తెలుసుకున్నాం. వారి సూచనల ప్రకారం వంట చేస్తే వంటా బాగా కుదిరేది. కాని మా స్వంత ఆలోచనలను పెట్టుక చేస్తే ఏదో పొరబాటు జరిగేది - అంటారు వంటశాల సంపూర్ణమ్మగారు.

వంటింట్లో పని చేసేవాళ్ళకు శ్రీభగవాన్ కబుర్లు చెప్పేవారు. వాళ్ళతో చలోక్తులు వేస్తూ ఆధ్యాత్మిక బోధనలు చేసేవారు. శాంతమ్మాళ్ అనే వంటచేసే ఆమె - ఒకసారి ఎన్నో పొట్లకాయలను వండాల్సి వచ్చింది. పొట్లకాయలలో నీరు ఎక్కువ ఉంటుంది. కాబట్టి మామూలుగా అయితే నీటిని పిండేసి తరువాత వేయించడం ఆనవాయితీ. కానీ నీటిని

తీయకుండానే వేయించాలనే వారు శ్రీ భగవాన్. ఒక పెద్ద మూకుడులో పొట్లకాయలను వేసి మేము కలియబెట్టున్నాము. అది చూసి శ్రీభగవాన్ ఉన్నట్టుండి తన చేతిలోని గరిటెను విడిచిపెట్టి శూన్యంలోకి చూచారు. కదలలేదు. వారివైపు చూస్తూంటే నా మనస్సు నిశ్చలమైంది. నా కళ్ళనుండి అంతా అంతర్ధానమైంది. కాసేపటి తర్వాత శ్రీవారు "కూరలోని నీళ్ళన్నీ పోయాయి. ఏ శబ్దమూ రావడం లేదు. ఇప్పుడు పోపు పెట్టవచ్చు" అన్నారు. "కూర అనే మనస్సును మౌనం చేసిన తరువాత జ్ఞానమనే సుగంధ ద్రవ్యాన్ని కలుపవచ్చు" అని తెలిసింది అన్నారు. చిన్న చిన్న విషయాల ద్వారా వారు మాకు వేదాన్తాన్ని ఆచరణ పరంగానూ, సిద్ధాంత పరంగానూ బోధించేవారు. వారి ప్రభావంతో మాలో సంపూర్ణ పరివర్తనం కలిగేది. రుబ్బుతున్నప్పుడు సంతోషాతిరేకాన్ని, వండుతున్నప్పుడు పారవశ్యాన్ని, భక్తులకు ఇడ్లీలు వడ్డిస్తున్నప్పుడు ఆనందాన్ని పొందేవారం అని వంటావిడ సుబ్బులక్ష్మి చెప్పింది.

అంత శ్రద్ధతో వంటని చేయించి స్వయంగా కూడా వంటచేసే శ్రీభగవాన్ భోజనం దగ్గఱ అనాసక్తంగా ఉండేవారు. అన్ని పదార్థాలను ఒకేసారి అన్నంలో కలిపి తినేవారు. అదేమిటి! అట్లా కలిపేస్తున్నారు? అని ఒకామె అడిగినప్పుడు 'ఎందుకిన్ని రకాలు! ఒక్కటి చాలు" అన్నారు

- (పింగళి సూర్యసుందరం గారి రమణీయం నుండి).

త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు ఈక్రింది వారు మూలనిధికి పైకం పంపినారు

01.	శ్రీ దువ్వూరి అనసూయమ్మ (మాధవరెడ్డి గారి భార్య, వెదుళ్ళ చెరువు)	- రూ. 107000/-
02.	జి.పి.ఎస్.గుప్త (అణ్ణానగర్, చెన్నై)	- రూ. 26000/-
03.	ఎస్. ఆరతి (సికింద్రాబాద్)	- రూ. 10,000/-
04.	దాసరి శ్రీనివాసులు (తిరుపతి)	- రూ. 10116/-

భాగవతం షష్ఠస్కంధము

- శ్రీ మాతా పరావిద్యానందగిరి స్వామిని

(గత సంచిక తరువాయి)

(రాక్షసుల గురువు) తన శక్తియుక్తులచే రాక్షసుల సంపదను భద్రపరచినప్పటికీ అది దేవేంద్రుని వశమయ్యెను. అసురులు ఓడిపోయిరి.

ఇక్కడ మనకు ఒక సంశయము కలుగవచ్చు. నారాయణ కవచము తెలిసిన విశ్వరూపుడు తానే దాని ప్రభావముతో దేవతలకు వారి సంపదను రాక్షసులను జయించి ఈయవచ్చును కదా ! అని. కాని ఎటుల సాధ్యము. సంపద కావలసినది దేవేంద్రునకు. ఆతడే తన శక్తితో దానిని సాధించుకొనవలెను. అందులకు అవసరమగు సాధనమును మాత్రము గురు రూపమున వున్న విశ్వరూపుడు దేవేంద్రునకు అందజేసెను. ఆత్మ సాక్షాత్కారము కొరకు మోక్షసామ్రాజ్యమును అధిష్ఠించదలచుకొన్న శిష్యునకు గురువు కేవలము దానికి సంబంధించిన సాధనములను తెలియజేయునే గాని తన సాధనాబలము చేత శిష్యుని మోక్ష సామ్రాజ్యమున ప్రతిష్ఠించడు.

"ఉద్ధరే దాత్మనాఽఽత్మానం' 'మగ్నం సంసారవారిధౌ'

సంసార సముద్రములో మునిగి కొట్టుమిట్టాడు శిష్యుడు గురువు అనుగ్రహముతో ఉపదేశించిన సాధనములను అనుష్ఠించి తనను తానే ఉద్ధరించుకొనవలయును. అంతియే గాక శిష్యుడు పొందదలచుకొన్నది అద్వైత సామ్రాజ్యము. అక్కడ గురువు, శిష్యుడు అను రూపములతో ద్వైతము (రెండు) వుండుటకు అవకాశము లేదు. అందువలననే విశ్వరూపుదుపదేశించిన 'నారాయణ కవచ' అనుస్ఠాన ప్రభావముచే దేవేంద్రుడు అసురులపై విజయము సాధించి తన సంపదను తాను పొందెను.

ఈ నారాయణ కవచము యొక్క మాహాత్మ్యము అత్యద్భుతమైనది.

దీనిని విశ్వరూపుడు దేవేంద్రునకు ఉపదేశించి ఓ దేవేంద్రా! దీనివలన ఇకపై నీవు సురక్షితుడవు కాగలవు. ఈ కవచ ప్రభావముతో నీవు సులభముగా అసుర సేనలను జయింపగలవు అని చెప్పెను. అంతియేగాక ఈ నారాయణ కవచమును నిరంతరము స్మరించుచూ ధరించువాడు కన్నులతో ఎవరిని చూచిననూ, తన పాదములతో ఎవరిని తాకిననూ వెంటనే అతడు కూడా తన భయములనన్నింటి నుండి బయటపడును.

ఈ వైష్ణవీ విద్యను అనుష్ఠించువానికి రాజులవలన గాని, దొంగల వలన గాని, భూతప్రేత పిశాచాదుల వలన గాని ఎటువంటి భయమూ వుండదు.

పూర్వము కౌశిక గోత్రమున జన్మించిన ఒక బ్రాహ్మణుడు ఈ విద్యను బాగుగా ఉపాసించెను. అతడు ఒక మరుభూమి యందు యోగ బలముచే తన శరీరమును త్యజించెను. కొంతకాలము తరువాత చిత్రరథుడు అను గంధర్వుడు తన స్త్రీలతోకూడి, విమానములో ఆకాశ మార్గమున వెళ్ళుచుండగా ఈ బ్రాహ్మణుడు శరీరమును వదలిన ప్రదేశమున విమానముతో సహా తలక్రిందులుగా పడిపోయెను. కారణమేమని విచారించగా వాలఖిల్య మహర్షుల ద్వారా విషయము తెలిసినది. ఇదంతయు ఆ నారాయణ కవచ ప్రభావమేనని తెలిసికొనిన గంధర్వుడు ఆ బ్రాహ్మణుని అస్థికలను పూర్వ వాహినయైన సరస్వతీ నదిలో కలిపి స్నానమాచరించిన పిదప తన పూర్వపు శక్తియుక్తులను పొందినవాడై తన లోకమునకు వెళ్ళగలిగెను.

ఈ నారాయణ కవచ స్తోత్రము యొక్క భావమును క్లుప్తముగా మనము తెలిసికొనుటకు ప్రయత్నం చేద్దాము.

పక్షిరాజైన గరుడుని మూపుపైన తన పాదపద్మములను వుంచి తన ఎనిమిది చేతులయందు క్రమముగా శంఖము, చక్రము, డాలు, ఖడ్గము, గద, బాణము, ధనుస్సు, పాశము ధరించియున్న భగవంతుడైన

శ్రీహరి నన్ను సర్వ విధముల రక్షించుగాక !

జల జంతువుల నుండి, వరుణ పాశము నుండి మత్స్యమూర్తియైన శ్రీహరి నన్ను జలములయందు రక్షించుగాక! మాయాబ్రహ్మచారి వేషమును ధరించి వామనమూర్తి నన్ను స్థలము నందు (భూమిపై) మరియు విశ్వమును వ్యాపించిన త్రివిక్రముడు నన్ను ఆకాశము నందునూ రక్షించుగాక!

వేదాన్తభేరికి పోషక చందా ఈక్రిందివారు పంపినారు

01.	టి.ఎం.గుప్త. (పుణ్యభూమి ప్రకృతి కేంద్రం -గోపాలపురం)	రూ. 2000/-
02.	డి.బాలకృష్ణారెడ్డి (సూళ్ళూరుపేట)	- రూ. 2000/-
03.	ఎం.మల్లికాంబ (రామచంద్రాపురం- సంగారెడ్డి)	- రూ. 3000/-
04.	ఎం.శ్రీహరి (హైద్రాబాద్)	- రూ. 1500/-
05.	పేట.కాత్యాయనమ్మ (రాచకండ్రిగ)	- రూ. 2000/-
06.	సి.గురవయ్య (అలకాపురి)	- రూ. 1500/-
07.	బి.డి.చెన్నారెడ్డి (ఎం.జి.పల్లె,నార్పల)	- రూ. 2000/-
08.	వై. కృష్ణప్రసాద్ (పోరంకి, పెనమలూరు)	- రూ. 2000/-
09.	వెన్ను ప్రమోదకుమార్ (సదాశివపేట)	- రూ. 2000/-
10.	వి.రామకుమారి (సికింద్రాబాద్)	- రూ. 2000/-
11.	కానాల భరత్‌రెడ్డి (బెంగుళూరు)	- రూ. 2000/-
12.	టి.నారాయణరెడ్డి (కొత్తపల్లి)	- రూ. 1500/-
13.	ముప్పిడి ధనలక్ష్మి (మచిలీపట్నం)	- రూ. 2000/-
14.	సి.నారాయణరావు (చెన్నై)	- రూ. 2000/-
15.	వి.నాగేశ్వరరావు (వాసవీకాలనీ)	- రూ. 1500/-
16.	దాసరి శ్రీనివాసులు (శారదానగర్ - తిరుపతి)	- రూ. 2000/-

కూర్మావతార ప్రశస్తి

- ఆర్. శోభాదేవి

బలి చక్రవర్తి మూడు లోకాలను జయించి రాజ్యపాలనం చేస్తున్నాడు. ఇంద్రుడు దూర్వాసుని శాపకారణంగా ఐశ్వర్యం కోల్పోయాడు. శ్రీహరి సూచనల మేరకు రాక్షసులతో సామరస్యంతో వుండి క్షీరసారగ మథనం చేసి అమృతం పొందదలచారు దేవతలు. వారి అశక్తతను చూచిన శ్రీహరి గరుడుని ద్వారా మందర పర్వతాన్ని క్షీరసాగరానికి చేర్చారు. వాసుకి చిలికే తాడుగా వుండటానికి అంగీకరించాడు. రాక్షసులు శక్తి సంపన్నులమన్న అహంతో తలవైపు పట్టుకోగా, దేవతలు తమకు తోకయే మంచిదని తలచారు. పాల సముద్రంలో మునిపోతున్న మందరగిరికి కుదురుగా శ్రీమహావిష్ణువు మహాకూర్మమై నిలిచాడు.

లక్ష యోజనముల వెడల్పుగల వీపు డిప్పతో బ్రహ్మాండాన్ని అంతటినీ మ్రింగగల నోటితో, పెద్ద కడుపుతో, విశ్వంపైబడ్డా చలించని కాళ్ళతో, పద్మాల వంటి కన్నులతో కూర్మం ప్రకాశించింది. సురాసురులు తీవ్రంగా చిలుకుతుండగా సముద్రంలోని జలజంతువులు భయభ్రాంతిని పొందాయి. అల్లకల్లోలమైన పాలసముద్రం నుండి అగ్నిజ్వాలలతో 'హాలాహలం' పుట్టి లోకాలను తపింపజేసింది. అందరూ వేడుకోగా లోక రక్షణార్థం శివుడు గ్రహించబోగా సర్వమంగళ తలయూచి తన అంగీకారాన్ని తెలిపింది.

కు. మ్రింగెడు వాడు విభుండని
మ్రింగెడిది గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుమనె సర్వమంగళ
మంగళ సూత్రంబునెంత మది నమ్మినదో (భాగవతం)

శివుడు గరళాన్ని ముద్ద చేసి చేతిలోని నేరేడు పండులాగా గొంతులోనే వుండేటట్లు నిలుపుకుని నీలకంఠుడైనాడు.

తర్వాత వచ్చిన కామధేనువును యజ్ఞ యాగాదుల కొరకు దేవ మునులు, ఉచ్చైశ్రవమనే తెల్లని గుర్రాన్ని బలి చక్రవర్తి, నాలుగు దంతాలు గల ఐరావతమును ఇంద్రుడు స్వీకరించారు. తర్వాత కల్పవృక్షం, అప్సరసలు, చంద్రుడు పుట్టారు.

పాల సముద్రం మీది మీగడ మిసమిసలతో, మెరుపుల కాంతులతో, ఎఱ్ఱ తామరల సువాసనలతో, బాల చంద్రుని అందంతో అలరారుతున్న లక్ష్మీదేవి ఆవిర్భవించింది. ఆమెకు ముత్తైదువులు మంగళ స్నానాలు చేయించగా దేవతలిచ్చిన పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించిన ఆమెను ఎల్లలోకాలకు ఏలికవు కమ్మని దిక్కులు దీవించాయి. సర్వలక్షణ సమన్వితుడైన హరిని పూలమాలతో వరించింది. సముద్రుడు అల్లునకు కౌస్తుభమును ఇచ్చాడు. తర్వాత పాల సమద్రము నుండి పుట్టిన వారుణిని రాక్షసులు స్వీకరించారు. వైద్య విద్యలో ఆరితేరిన ధన్వంతరి అమృత కలశంతో వెలువడగా రాక్షసులు దానిని చేజిక్కించుకున్నారు.

జగన్మోహిని తన సోయగాలతో రాక్షసులను మోహపరచి అమృతాన్ని తననే పంచమనేట్లు చేసి దేవతలకే పంచుతుండగా రాహువు, దేవతల మధ్య నిలిచి అమృతం తాగాడు. సూర్యచంద్రుల సంజ్ఞను గుర్తించిన విష్ణువు చక్రంతో అతని తలను ఖండించాడు. రాక్షసులకు అమృతం దొరక నందు వల్ల దేవతలతో యుద్ధం చేశారు. తడీపొడీ కాని సముద్రపు నురగలో ముంచిన వజ్రాయుధంతో నముచి శిరస్సును దేవేంద్రుడు ఖండించాడు. శుక్రాచార్యుడు సంజీవినీ విద్యతో మరణించిన రాక్షసులను బ్రతికించాడు. మోహినీ రూపాన్ని చూచిన శివుడు భ్రమపడి ఆమె వెంటబడి నిగ్రహాన్ని కోల్పోయాడు. వెంటనే విష్ణు మాయలోని మైమరపును శివుడు గమనించు కున్నాడు. (సశేషం)

వార్తలు

(01). 25-12-2020 తేది మార్గశిర శుద్ధ ఏకాదశి శుక్రవారం నాడు గీతాజయన్తి పర్వదినమున శ్రీశుకబ్రహ్మాశ్రమంలో బ్రహ్మచారి విజయానన్ద అధ్వర్యమున భగవద్గీతకు అర్చన, 18 అధ్యాయాల పారాయణ జరిగినది. భక్తులకు అన్న సంతర్పణ జరిగినది.

(02). తిరుపతి శ్రీమలయాళ సద్గురు సేవా సమాజంలో 25-12-2020 తేది గీతాజయన్తి సందర్భంగా గీతామాతకు శ్రీకృష్ణ పరమాత్మకు, శ్రీమలయాళ స్వాములవారికి ఉదయం అర్చన చేయబడినది. అఖండ గీతాపారాయణం జరిగినది. శ్రీమలయాళ సద్గురు సేవా సమాజ స్వర్ణోత్సవాలు కరోనా వలన వాయిదా వేయబడినవి. కరోనా నియమాలను పాటిస్తూ 50వ వార్షికోత్సవం మాత్రం జరిగినది. ఆ సందర్భంగా సమాజ స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరింపబడినది. పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు, పూజ్యశ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారు, పూజ్యశ్రీ సర్వాత్మానందస్వాములవారు, డా॥సముద్రాల లక్ష్మణయ్యగారు గీతాతత్త్వంపై ఉపన్యసించారు. పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు అధ్యక్షత వహించారు. 26-01-2021 తేది సమాజ సర్వ సభ్యసమావేశం జరిగినది.

(03). 30-12-2020 తేది పౌర్ణమి నాడు మిట్టకండ్రిగ గిరిజన సెంటర్‌లో దేవతార్చన, భజన తరువాత గిరిజనులకు అన్న సంతర్పణ సద్గురు సర్వసేవా ట్రస్టు శ్రీ శుకబ్రహ్మాశ్రమం వారిచే చేయబడినది.

(04). 01-12-2020 తేది నుండి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలోని భక్త కన్నప్ప కంటి ఆసుపత్రి కరోనా నిబన్ధలకు లోబడి పని చేయుచున్నది.

30-11-2020 తేదీ కార్తీక పౌర్ణమి నాడు తుఫాన్ సెంటర్ గిరిజన కాలనీలో

సద్గురు శుకబ్రహ్మాశ్రమ సద్గురు సేవాట్రస్టుచే అన్నదానం చేయుట

30-11-2020 తేదీ కార్తీక పౌర్ణమి నాడు తుఫాన్ సెంటర్ గిరిజన కాలనీలో

సద్గురు శుకబ్రహ్మాశ్రమ సద్గురు సేవాట్రస్టుచే అన్నదానం చేయుట

30-11-2020 తేదీ కార్తీక పౌర్ణమి నాడు తుఫాన్ సెంటర్ గిరిజన కాలనీలో

సద్గురు శుకబ్రహ్మాశ్రమ సద్గురు సేవాట్రస్టుచే అన్నదానం చేయుట

Regd.No. TRP / 123 / 2021 - 23 January 2021 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-12-2020, Permitted to post : 29th, 30th every month.

25-12-2020 గీతాజయంతినాడు శ్రీమలయాళసద్గురు సేవాసమాజంలో
పూజింప బడిన శ్రీకృష్ణపరమాత్మ

ఈ పేజీ స్థల దాతలు
సుభద్రా చారిటబుల్ ట్రస్టు
హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం